డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా

జిల్లా ఎస్పీ వి.రత్న

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి శివారు ప్రాంతాలు, నిర్మానుష్య ప్రదేశాల్లో జూదం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై డ్రోన్ల ద్వారా నిఘా ఉంచినట్లు ఎస్పీ వి.రత్న పేర్కొన్నారు. ఆదివారం పుట్టపర్తి అటవీ ప్రాంతాలైన అమ్మకొండ పాలెం, కంబాలపర్తి పరిసరాల ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగ మద్యం సేవించడం, గంజాయి వినియోగం,పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహణ,ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్ ఇతర నేరాలు జరగకుండా డ్రోన్ కెమెరాల పోలీసులు ప్రత్యేక ఉంచినట్లు ఎస్పీ తెలిపారు.

పూటుగా మద్యం

'ఎంఆర్పీ కన్నా ఎక్కువ ధరకు మద్యం అమ్మినా, బెల్ట్ షాపులు నిర్వహించినా రూ.5 లక్షలు జరిమానా. బెల్టు షాపులు నిర్వహిస్తూ రెండోసారి పట్టుబడితే లిక్కర్ షాపు లైసెన్స్ రద్దు చేస్తాం' ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెప్తున్న మాట. కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. మద్యం షాపుల వద్ద అనధికార రూమ్‌లు, గ్రామాల్లో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. నిబంధనలను పక్కన బెట్టి మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మద్యం అమ్మకాలు పెరగడంతో పూటుగా తాగిన మందుబాబులు రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. ఇటీవల అనంతపురం నగరంలో పలు ప్రాంతాల్లో మద్యం బాబుల చేష్టలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఇలాంటి వాటిని నియంత్రించాల్సిన ఎక్సైజ్ శాఖ ప్రేక్షక పాత్రకే పరిమితం అవుతోందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

- అనధికార పర్మిట్ రూములు
- గ్రామాల్లో బెల్టు షాపులు
- రోడ్లపై మందుబాబుల హల్‌చల్
- పోలీసులనూ లెక్కచేయని వైనం
- ప్రేక్షక పాత్రలో ఎక్సైజ్ శాఖ

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

గత ప్రభుత్వ హయాంలో మద్యం షాపులను ప్రభుత్వమే నడిపేది. ధర ఎక్కువ కావడంతో పక్క రాష్ట్రమైన కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తెచ్చి దొంగచాటుగా అమ్మేవారు. దీన్ని కట్టడి చేయడానికి గత ప్రభుత్వం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో (సెబ్)ను ఏర్పాటు చేసింది. ప్రభుత్వం మారిన వెంటనే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో నూతన మద్యం పాలసీని రద్దు చేసి పాత పద్ధతిలో టెండర్లను పిలిచి మద్యం షాపులను ప్రయివేటు వ్యక్తులకు అప్పగించింది. ఇందులో భాగంగా సెబ్‌ను రద్దు చేసి ఎక్సైజ్ శాఖను పునరుద్ధరించింది. ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు మద్యం అమ్మకుండా చూడటం, ఎక్కడా బెల్టు షాపులు నిర్వహించకుండా చూడటం, మద్యం షాపుల యజమానులు నిబంధనలు ఉల్లంఘించకుండా చూడటం ఎక్సైజ్ అధికారుల విధి. అయితే ఎక్సైజ్ అధికారులు మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రతి షాప్‌కు అనధికారిక పర్మిట్ రూమ్

జిల్లా వ్యాప్తంగా 136 మద్యం షాపులు ఉండగా అనంతపురం నగరంలోనే 41 షాపులు ఉన్నాయి. నిబంధనల మేరకు మద్యం షాపుల వద్ద తాగడానికి లేదు. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఒక్కో షాపు నుంచి రూ.2 లక్షలు కట్టించుకుని తాగడానికి పర్మిట్ రూములకు అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం ఇంకా అటువంటి అనుమతులు ఏవీ రాలేదు. ఒకటి రెండు షాపులు మినహా మిగిలిన అన్ని షాపుల వద్ద బహిరంగంగా అనధికారిక పర్మిట్ రూములు నిర్వహిస్తున్నారు. దీన్ని కట్టడి చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇందుకు కారణం కొంత మేరకు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు కాగా మిగిలిన షాపుల నుంచి మామూళ్లు ముట్టడమేనన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు గ్రామగ్రామాన బెల్టు షాపులు ఏర్పాటు చేసి బహిరంగంగానే మద్యం అమ్మకాలు చేస్తున్నారని సమాచారం. అది కూడా గతంలో ఎవరు అమ్మినా వారిని పట్టుకుని కేసులు నమోదు చేసే ఎక్సైజ్ అధికారులు ప్రస్తుతం అధికార పార్టీ కార్యకర్తలు బెల్టు షాపులు నిర్వహిస్తూ ఉండటంతో పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

రోడ్లపై మందుబాబుల హల్ చల్

అనధికారిక పర్మిట్ రూముల్లో మందు తాగి ఇక తమనెవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో మందుబాబులు రోడ్లపైకి వచ్చి హల్ చల్ చేస్తున్నారు. పట్టపగలే రోడ్లపై గొడవలకు దిగుతున్నారు. వారించడానికి వచ్చిన పోలీసులను సైతం ఎదిరిస్తూండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వారం రోజుల క్రితం కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న ఓ షాపులో పూటుగా మద్యం సేవించిన ఓ మందుబాబు అటుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు అద్దాలు పగులకొట్టాడు. వెంటనే డ్రైవర్, కండెక్టర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. తనను పట్టుకున్నారు కానీ ఆర్టీసీ వారిని ఎందుకు పట్టుకోవడం లేదంటూ పోలీసులపై మద్యం తాగిన వ్యక్తి విరుచుకుపడ్డాడు. ఇది జరిగిన మరుసటి రోజు రాత్రి బళ్లారి బైపాస్ లోని అనధికారిక పర్మిట్ రూములో మద్యం సేవించిన మందుబాబులు దివాకర్ పాన్ సెంటర్ వద్ద నడిరోడ్డుపై హల్ చల్ చేశారు. దీంతో 4వ పట్టణ సిఐ సంఘటనా స్థలానికి చేరుకుని గొడవను కట్టడి చేయాల్సి వచ్చింది. ఇలా తరచూ ఏదో ఒక చోట మద్యం బాబుల వికృత చేష్టలు కన్పిస్తున్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు, పోలీసులు చర్యలు తీసుకుని మద్యం షాపులు వద్ద అనాధికారంగా తాగడాన్ని నియంత్రించి, అమ్మకాలపై నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

బళ్ళారి బైపాస్‌లో దివాకర్ పాన్ సెంటర్ వద్ద మందుబాబుల గురించి విచారిస్తున్న 4వ పట్టణ సిఐ సాయినాథ్(ఫైల్‌ఫోటో)

నత్తనడకన భూసేకరణ

- అవసరం 9500 .. సేకరణ 4808 ఎకరాలు..!
- హంద్రీనీవా విస్తరణ ముందుకు కదిలేనా ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హంద్రీనీవా రెండో దశ లైనింగ్‌కు రూ.930 కోట్లు విడుదల చేసిన నేపథ్యంలో ఈ ప్రాజెక్టుపై పెద్దఎత్తున చర్చ నడుస్తోంది. మొదటి దశ వెడల్పు పరిస్థితి ఏమిటన్న డిమాండ్ విపక్షాల నుంచి ఎదురవుతోంది. ఈ వెడల్పును 3850 క్యూసెక్కులకు పెంచుతామని ప్రభుత్వం చెబుతోంది. ఇది చేయాలంటే ఇప్పటికీ భూసేకరణ పనులు నత్తనడకనే నడుస్తున్నాయి. దశబ్దకాలంగా సేకరణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఒకవైపు ప్రాజెక్టుల శంకుస్థాపనలు మాత్రం జరిగిపోవడమే కాకుండా కొంత వరకు పనులను కూడా చేపట్టారు. నిర్వాసితుల సమస్యలను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

హంద్రీనీవా మొదటి దశలో కావాల్సింది 9500 ఎకరాలు

హంద్రీనీవా మొదటి దశలో జరుగుతున్న పనులకు సంబంధించి మొత్తం 9500 ఎకరాల భూమి అవసరమవుతుంది. ఇందులో 8332 ఎకరాలకు సంబంధించి భూసేకరణకు అవసరమైన ప్రక్రియను అధికార యంత్రంగం చేసింది. ఇందులో సేకరించింది మాత్రం ఇప్పటి వరకు 4808 ఎకరాలు మాత్రమే. అనుమతిపొంది వారకు చూసుకున్నా ఇంకా 3524 ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉంది. పేరూరు ఎత్తిపోతల పథకాన్ని 2018లో తెలుగుదేశం ప్రభుత్వమే చేపట్టింది. ఆ తరువాత వైసిపి అధికారంలోకి వచ్చాక పూర్తి చేస్తామని ప్రకటించింది. ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలంటే ముందుగా జరగాల్సిన భూసేకరణ మాత్రం రెండు ప్రభుత్వాల హయంలోనూ జరగలేదు. పేరూరు ఎత్తిపోతల పథకానికి మొత్తం 2729 ఎకరాల భూమి అవసరం. ఇందులో 2497 ఎకరాలకు అనుమతులు పొందారు. సేకరించింది మాత్రం 988 ఎకరాలు మాత్రమే. ఇంకా 1508 ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉంది. దీని తరువాత భైరవానితిప్ప ప్రాజెక్టుకు హంద్రీనీవా నుంచి నీళ్లందించే ఈ ప్రాజెక్టు 2018 తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే చేపట్టారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చక భూసేకరణకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బటన్ కూడా నొక్కారు. కాని ఇప్పటికీ పూర్తి స్థాయి భూసేకరణ జరగలేదు. ఈ ప్రాజెక్టు కింద 1406 ఎకరాలు సేకరించాల్సి ఉండగా 789 ఎకరాలు మాత్రమే సేకరించారు. ఇంకా 617 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఇది కాకుండా పంపుహౌస్ నిర్మాణానికి 120 ఎకరాలు సేకరించాలి. ఆమిదాల బ్రాంచ్ కెనాల్‌కు 9.15 ఎకరాలు, గుంతకల్లు నియోజకవర్గంలో చెరువులకు నీరందించేందుకు 226 ఎకరాలు, ప్యాకేజీ 33 కింద 49 ఎకరాలు, ప్యాకేజీ 34 కింద 157 ఎకరాలు,. ప్యాకేజీ 36 కింద మొత్తం 835 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఇవి పూర్తి చేయకుండా ఏళ్ల తరబడి ప్రభుత్వం ప్రకటనలు చేస్తూనే ఉంది.

నిర్వాసితులకు న్యాయం చేసి పనులు చేపట్టాలి
వి.రాంభూపాల్ సిపిఎం జిల్లా కార్యదర్శి.

హంద్రీనీవా కింద అనేక హామీలను ప్రభుత్వాలు ఇస్తూనే ఉన్నాయి. అందుకు తగ్గట్టు చర్యలు మాత్రం ఉండటం లేదు. రెండు ప్రభుత్వాల హయంలోనూ పేరూరు ఎత్తిపోతలు, బిటిపికి నీరిస్తామని చెప్పారు. కాని దానికి ప్రాథమికంగా అవసరమైన భూసేకరణనే ఇప్పటికీ చేపట్టలేదు. తాజాగా లైనింగ్‌కు నిధులు కేటాయించారు. భూసేకరణ చేపట్టకుండా, నిర్వాసితులకు న్యాయం చేయకుండా పనులు తాత్సారం చేయడం సరైంది కాదు.

ప్రభుత్వ భూముల జోలికొస్తే క్రిమినల్ కేసులు : కందికుంట

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి-కదిరి టౌన్

భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఊరు అభివృద్ధి కోసం పాటుపడదామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ భూములు కబ్జా చేసి విక్రయిస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆదివారం రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రైతులు, అధికారులు, పట్టణ ప్రజలతో సమావేశం నిర్వహిం చారు. ముందుగా ప్రజలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు సమస్యలను ఎమ్మెల్యే ఎదుట ఏకరువు పెట్టా రు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం భూముల మార్కెట్ విలువ ఎంత ఉంటే దానికి తగ్గట్టు ధరలకే విక్రయించాలని ప్రజలను మభ్యపెట్టి మోసం చేయవద్దన్నారు. మున్సిపాలిటీకి రుసుము చెల్లించి అప్రూవల్ తీసుకోని లేఅవుట్లు వేయాలన్నారు. కొందరు కులం, మతం పేరుతో రాజకీయాలు చేస్తున్నా రని అలాంటి వాటికి స్వస్తి పలకాలన్నారు. అక్రమ మార్గంలో వ్యాపారాలు చేస్తే చూస్తూ ఊరుకో మన్నారు. తప్పుడు పనులు చేసి అధికారులను బెదిరించి పనులు చేసుకోవాలని చూస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. దొంగ పట్టాలు, భూ కబ్జాలపై ఎవరు ఫిర్యాదు చేసినా పార్టీలకు అతీతంగా పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొందరు రెండేళ్లలో జమిలీ ఎన్నికలు వస్తాయని కలలుగంటున్నారు. ఐదేళ్ల తర్వాతనే ఎన్నికలు వస్తాయన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్ప డితే ఎంతటి వారైనా చర్యలు తప్పవు అన్నారు. సమావేశంలో ఆర్డీవో వెంకటసన్యాసిశర్మ, కమిషనర్ కిరణ్‌కుమార్, తహశీల్దార్ మురళీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పార్థసారధి, నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లు.. రాకపోకలకు ఇబ్బందులు..

- కంకరేసి... మరింత అధ్వానం చేసిన ఆర్అండ్‌బి
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో గురునాథ టాకీస్ నుంచి... రహమత్ పూర్ సర్కిల్, ఆటోనగర్ వరకు రోడ్లు అత్యంత రద్దీగా ఉంటాయి. దీంతో పాటు అంతర్గత రహదారుల్లో ముఖ్యమైన రైల్వే రోడ్డులో కూడా రాకపోకులు అధికంగా ఉంటాయి. ఈ ప్రధాన రహదారులు గుంతల మయంగా మారిపోయాయి. ఈ రోడ్లను మరమ్మతులు చేసి మోక్షం ఎప్పుడు లభిస్తోందని వాహనదారులు ఎదురుచూస్తున్నారు. ఆర్అండ్‌బి అధికారులు వారి ఆధీనంలో ఉన్న రహదారుల్లో ఉన్న గుంతలను పూడ్చేస్తామంటూ ముందుకు వచ్చి చిన్న గుంతను పెద్ద గుంత చేసి, దానిపై కంకర వేసి, మరమ్మతు చేసే సమయంలో తీసిన కంకర, తారును రోడ్డు పక్కనే పడేసి వెళ్లిపోయారు. దీంతో వారి ఆధీనంలో ఉన్న రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయి. పురపాలక శాఖ ఆధీనంలో ఉన్న పట్టణ అంతర్గత రహదారుల్లో ప్రధానమైనది రైల్వే రోడ్డు. ఈ రోడ్డు విస్తరణ చర్యలు చేపట్టి, రహదారికి ఇరువైపులా భవనాలను తొలగించి అలాగే వదిలేశారు. రోడ్డు మొత్తం గుంతల మయం కావడంతో ఇందులో రాకపోకలంటనే వాహనదారులు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. నూతన రోడ్డు వేయడానికి పూర్తిస్థాయిలో ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడంతో కనీసం గుంతలు పూడ్చి, వాటిపై తారువేసి మరమ్మతు చేయడానికి ప్రభుత్వం ముందుకు వచ్చింది. దీఎని కోసం నిధులు సైతం విడుదల చేసింది. ఈ నిధులతో రోడ్డు మరమమ్మతు చేయాల్సిన అధికారులు తూతూ మంత్రంగా గుంతలను పూడ్చి నిధులను దండుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. గత పది రోజుల క్రితం ఆర్అండ్‌బి శాఖ అధికారులు బైపాస్ రోడ్డులో ఉన్న గుంతలను పూడ్చడానికి ముందుకు వచ్చారు. ఆ సమయంలో గుంతలు ఉన్నచోట కంకర వేసి, వెంటనే తారు వేసి మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు, జెసిబి తీసుకొచ్చి గుంతలు ఉన్నచోట మరింత గుంతను చేసి, ఆ రోడ్డులో నుంచి తీసిన కంకర, తారును రోడ్డు పక్కనే పడేశారు. ఆ గుంతల్లో కంకర, డస్ట్ వేసి చేతులు దులుపుకున్నారు. నాలుగు రోజుల క్రితం కురిసిన చిన్నపాటి వర్షాలకు కంకరతో పాటు వేసిన డస్టు నీటికి కొట్టుకుపోయింది. కంకర మాత్రం మిగిలింది. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వేలాది వాహనాలు తిరుగుతున్నాయి. వెంటనే ఈ రహదారులను ఆర్అండ్‌బి శాఖ అధికారులు మరమ్మతు పనులు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

గుంతలమయంగా మారిన పట్టణంలో ఆర్అండ్‌బి శాఖ ఆధీనంలో ఉన్న రోడ్డు

చిన్న గుంతను పెద్ద గుంతగా చేసి, రోడ్డు పక్కన తారును పడేసిన అధికారులు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- నిధులు విడుదలైన వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం
- అక్రమ కట్టడాలు...రహదారుల విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ
- పట్టణాభివృద్ధి... సమస్యల పరిష్కారమే లక్ష్యం
- ప్రజాశక్తితో మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, దీని కోసం రాత్రిపూట కొంత మంది పారిశుధ్య కార్మికులను నియమించి సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా పనులు చేపట్టాం. అక్రమ కట్టడాలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు పట్టణంలో రహదారుల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. పట్టణాభివృద్ధి కోసం డిపిఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాం. నిధులు విడుదలైన వెంటనే పనులను ప్రారంభించి, పనుల్లో ఎక్కడా రాజీ పడకుండా నాణ్యతతో పనులను పూర్తి చేయించి హిందూపురం పురపాలక సంఘాన్ని రాష్ట్రంలోనే ఉత్తమ పురపాలక సంఘంగా తీర్చిదిద్దుతామన్నారు. వీటితో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకొంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు ప్రజాశక్తితో అన్నారు.

ప్రజాశక్తి : పట్టణ పారిశుధ్యంపై మీరు ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారు .?

కమిషనర్ : పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగు పరచడం కోసం ప్రత్యేక దృష్టి సారించాం. ప్రస్తుతం 80 మంది పర్మినెంట్ కార్మికులు, 220 మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. పట్టణ జనాభాకు అనుగుణంగా ఈ కార్మికుల సంఖ్య తక్కువగా ఉంది. కోవిడ్ సమయంలో మరో 60 మంది కార్మికులను తీసుకున్నాం. వారితో రాత్రి సమయంలో పారిశుధ్య పనులు చేపడుతున్నాం.

ప్రజాశక్తి: పారిశుధ్య మెరుగుకు ప్రణాళికలు రూపొందించారా.?

కమిషనర్ : పారిశుధ్య మెరుగు పరచడానికి ప్రణాళికలను రూపొందించుకున్నాం. ఉదయం పూట ప్రధాన రహదారులు శుభ్రం చేస్తే పాదాచారులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. దీని కోసం రాత్రి శానిటేషన్ పనులను ప్రారంభించాం. సచివాలయ వ్యవస్థ రావాడంతో అందులో ప్రత్యేకంగా శానిటేషన్ సెక్రటరీని నియమించడంతో నిరంతరం పర్వేక్షణ చేస్తూ పట్టణాన్ని సర్వ సుందరంగా తీర్చిదిద్దుతాం.

ప్రజాశక్తి : అక్రమ కట్టడాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు ?

కమిషనర్ : పట్టణ వ్యాప్తంగా అక్రమ కట్టడాలను గుర్తించడానికి కొంత మంది అధికారులను ఏర్పాటు చేశాం. వీరితో పాటు వార్డు ప్లానింగ్ సెక్రటరీల ద్వారా అక్రమ కట్టడాలను గుర్తించి, వాటిని బిపిఎస్ పథకం ద్వారా సక్రమ కట్టడంగా మారుస్తాం. దీనికి కొన్ని రోజులు సమయం పడుతుంది.

ప్రజాశక్తి : అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి ప్రణాళికలు రూపొందించారా ?

కమిషనర్ సంఘం శ్రీనివాసులు

కమిషనర్ : పట్టణంలో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయన్నది వాస్తవం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పట్టణ అభివృద్ధిపై స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక దృష్టి సారించారు. పట్టణ వ్యాప్తంగా మౌలిక సదుపాయాల కోసం రూ.92 కోట్లు, అస్తవ్యస్తంగా ఉన్నా నీటి పైపులైను, ఓవర్ హెడ్ ట్యాంకులు ఏర్పాటుకు రూ.120 కోట్లు నిధులు మంజూరు చేయాలని డిపిఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపడం జరిగింది. త్వరలో ఈ నిధులు మంజూరు అవుతున్నాయి. వీటితో పాటు భూగర్భ మురుగు నీటి వ్యవస్థ ఏర్పాటుకు రూ.450 కోట్లతో ప్రణాళికలు రూపొందించి, కేంద్ర ప్రభుత్వానికి అమృత్ పథకం ద్వారా మంజూరు చేయాలని కోరడం జరిగింది. ఈ నిధులను తీసుకురావాడానికి ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఈ నిధులు మంజూరైన వెంటనే పనులను వేగవంతంగా పూర్తిచేస్తాం.

ప్రజాశక్తి: బిల్లులు ఎక్కడికక్కడా అగిపోయాయి. సరి దిద్దాడానికి ఎటువంటి చర్యలు తీసుకోంటారు.?

కమిషనర్: నిధులు లేకపోవడంతో బిల్లుల మంజూరు అలస్యం అవుతోంది. దీనివల్ల అభివృద్ధి పనులు సైతం ఆగిపోయాయి. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లం జరిగింది.

ప్రజాశక్తి: కౌన్సిల్ సహకారం ఎలా ఉంది..?

కమిషనర్: తాను నూతనంగా బాధ్యతలు స్వీకరించాను. పాలకవర్గం నుంచి పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందుతున్నాయి. పార్టీలకు అతీతంగా అన్ని వార్డు కౌన్సిలర్లను కలుపుకుని పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్ది, రాష్ట్రంలోనే హిందూపురం పురపాలక సంఘానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాడానికి కృషి చేస్తాను.

'పురం'లో మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎంజిఎం పాఠశాల ఆవరణంలో ఆదివారం జనసేన నియోజక ఇన్‌ఛార్జి ఆకుల ఉమేష్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన ఎంఎస్ రామయ్య అసుపత్రి సౌజన్యంతో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు అంజినప్ప, ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర, కార్యదర్శి బాలాజి, బిజెపి నియోజక వర్గ నాయకులు ఆదర్శ కుమార్‌లు ముఖ్య అథితులుగా పాల్గొని జ్యోతి వెలిగించి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు వచ్చారు. వారందరికీ వైద్య శిబ్బంది ఈసిజితో పాటు ఇతర వైద్య పరీక్షలను నిర్వహించి, అందరికీ ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిలకం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఆకుల ఉమేష్ ఎంఎస్.రామయ్య అసుపత్రి వారి సౌజన్యంతో మెఘా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఉమేష్ మాట్లాడుతూ వైద్య శిబిరానికి మంచి స్పందన లభించిందన్నారు. వైద్యులు దాదాపు 600 మందికి పైగా పరీక్షలను నిర్వహించి, అందరికీ మందులను పంపిణీ చేశామన్నారు. అనంతరం ఆకుల ఉమేష్ ముఖ్య అథితులుగా పాల్గొన్న వారితో పాటు వైద్యులకు, వైద్య శిబ్బందికి ఘనంగా సన్మానించి, మెమోంటోలను అందించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం రూరల్ టీడీపి మండల కన్వీనర్ అశ్వర్థరెడ్డి, కిరికెర రాము, మంగేష్, వెంకటేష్, రమణ, జిల్లా కార్యదర్శి రమణ, జనసేన హిందూపురం పట్టణ అధ్యక్షులు కొల్లకుంట శేఖర్, చిలమత్తూరు మండల కన్వీనర్ చిన్న ప్రవీణ్, అగ్గి శ్రీనివాసులు, లేపాక్షి నాయకులు లోకేష్, బాలాజీ, హిందూపురం సీనియర్ నాయకులు లక్ష్మణ్ మూర్తి, అంజినేయలు, మోహన్, వినోద్, జగదీష్, గాజుల నాగభూషణ, హనుమంతు, నాగరాజు, జనసైనికులు, తదితరలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని పరిశీలన చేస్తున్న చిలకం మధుసూదన్ రెడ్డి

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై
నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ తెలిపారు. పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో సంక్షేమ బోర్డును రద్దు చేసిందన్నారు. ఆ బోర్డులో ఉన్న రూ. 128 కోట్లను అప్పటి ప్రభుత్వం ఇతర పనులకు నిధులు మళ్లిం చిందన్నారు. వైసిపి ప్రభుత్వం తెచ్చిన 1214 మెమోలను రద్దు చేసి సంక్షేమ బోర్డును పునరుద్ధరిం చాలని, సంక్షేమ బోర్డులు నిధును భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని, మంజూరైన బీమా క్లైములను వెంటనే చెల్లించాలని, ఇసుక పంపిణీలో దళారుల జోక్యాన్ని అరికట్టాలని, పెండింగులో ఉన్న గుర్తింపు కార్డులు, క్లైములను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై వైసిపి ప్రభుత్వంలో అనేక పోరాటాలు చేశామని, అప్పుడు టిడిపి, జనసేన పార్టీలు మద్దతు ఇచ్చారన్నారు. తాము అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కూటమి పార్టీలు అధికారం చేపట్టి ఆరు నెలలైనా పట్టించుకోలేదని విమర్శించారు.

'గురుకులం'లో అదనపు సిబ్బందిని నియమించాలి

ప్రజాశక్తి-నల్లచెరువు


మంత్రి సవితకు పూలబొకే ఇస్తున్న క్రిష్టప్ప

మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా జనరల్ సెక్రటరీ కె.క్రిష్ణప్ప ఆదివారం బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చి అభినందించారు. చిలమత్తూరు మండలంలోని టేకులోడు మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ శోభారాణి అధ్యక్షతన నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ మెగా మీటింగ్‌కు క్రిష్టప్ప హాజరయ్యారు. అటవీ ప్రాంతంలో ఒకే చోట పాఠశాల, కళాశాల రెండూ ఉన్నాయని, విద్యార్థుల రక్షణ, భద్రత దృష్ట్యా అదనంగా మరో ముగ్గురు సెక్యూరిటీ గార్డులను నియమించాలన్నారు. అదనంగా వంట మనుషులు, హెల్పర్లు, స్వీపర్లను ఇవ్వాలని, బోధన, బోధనేతర సిబ్బంది కోసం ప్రత్యేకంగా గదులు మంజూరు చేయాలని కోరారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బాత్ రూమ్స్, డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలని, వేడినీటి(సోలార్) సౌకర్యం కల్పించాలని కోరుతూ క్రిష్టప్ప మంత్రికి వినతి పత్రం సమర్పించారు.


చౌకధాన్యం డీలర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, కేవప్పలను సన్మానిస్తున్న డీలర్లు

చౌకధాన్యం డీలర్ల సంఘం ఎన్నిక

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండల చౌకధాన్యం డీలర్ల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఆదివారం మండలంలోని చౌక ధాన్యం డిపోల డీలర్లు ఎన్నుకున్నారు. స్థానిక మాణిక్యం ఫంక్షన్ హాల్ వద్ద నిర్వహించిన సమావేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా గుంటిపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్, ఉపాధ్యక్షునిగా కొత్తచెరువుకు చెందిన కేశప్పను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులను కార్డుదారులకు సక్రమంగా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, డీలర్లు సైకిల్ షాపు బాబా, భాస్కర్, శివ, మాధవి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న హిందూ దేవాలయాల పరిరక్షణ కమిటీ సభ్యులు

తిమ్మమ్మమర్రిమానును పరిరక్షించాలి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మ మర్రిమాను వద్ద ఆదివారం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో హిందూ దేవాలయాల పరిరక్షణ కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపిడిఒ అంజనప్ప హాజరయ్యారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ హిందూ దేవాలయాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని, ఆలయాలపై దాడులు జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన తిమ్మమ్మ మర్రిమాను మన మండలంలో ఉండటం అదృష్టంగా భావించాలన్నారు. ఇలాంటి పుణ్యక్షేత్రాలు, హిందూ దేవాలయాల అభివృద్ధికి కలిసికట్టుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. జనవరి 5వ తేదీ విజయవాడలో జరిగే మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల విహెచ్‌పి కన్వీనర్ జయరాములు, వెంకటనారాయణ, శ్రీనివాసులు, మేకల రమణ, సోమశేఖర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

కొడిగెనహళ్లిలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-పరిగి

పూజారి పుండరీకాక్ష జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో భగత్‌సింగ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని కొడిగెనహళ్లి ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. శిబిరంలో బిపి, షుగర్‌తో పాటు గుండె సంబంధిత, తదితర వ్యాధులకు సంబంధించి బెంగళూరులోని మణిపాల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ శివకుమార్, ఆరోగ్య హాస్పిటల్ ఎండి డాక్టర్ తారక్ నాథ్, డాక్టర్ మహేంద్ర, హాస్పిటల్ అడ్మిన్ సంతోష్, వారి సిబ్బంది వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ రంగుడుయాదవ్, మాజీ ఎంపిపీ సత్యనారాయణ, ఎన్లైట్ కళాశాల కరస్పాండెంట్ సురేష్, ఉధ్యాయులు రామలింగయ్య, లక్ష్మీనారాయణ, నాయుడు, ఆదినారాయణ, భగత్‌సింగ్ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఎస్ఐ రంగడుయాదవ్

ట్రూ అప్ ఛార్జీలు తగ్గించాలి
రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిల పక్షం, ప్రజా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-పెనుకొండ

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న అఖిలపక్షం, ప్రజా సంఘాల నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీల పేరిట ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాన్ని తక్షణమే తగ్గించాలని అఖిలపక్షం, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్ అండ్ అతిథి గృహంలో ఆదివారం సిపిఎం నాయకులు హరి అధ్యక్షతన అఖిలపక్షం, ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. హరి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులపై మోపిన రూ.15,441 కోట్ల ట్రూ అప్ ఛార్జీల భారాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించాలన్నారు. ప్రజల అభిప్రాయాలు తెలుసుకోకుండా ఏకపక్షంగా ట్రూ అప్ ఛార్జీలు విధించడం అన్యాయం అన్నారు. ఎన్నికల ముందు వినియోగదారుల ప్రయోజనాలు కాపాడుతామని గొప్పలు చెప్పి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఇలాంటి నిరంకుశ పోకడలకు స్వస్తి పలకాలన్నారు. కలిసి వచ్చే రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలను ఏకం చేసి ప్రజలను చైతన్యపరచి ట్రూ అప్ ఛార్జీలను ఉపసంహరించేంత వరకూ దశల వారీగా పోరాటం చేస్తామన్నారు. సిపిఐ నాయకులు శ్రీరాములు మాట్లాడుతూ ఎప్పుడో వాడిన విద్యుత్‌కు ఇప్పుడు అదనంగా డబ్బు చెలించాలన్న ట్రూ అప్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కాంగ్రెస్ నాయకులు నిస్సార్ మాట్లాడుతూ అదనపు ఛార్జీలు కార్పొరేట్ల లాభాపేక్ష కోసమే అని, ఈ భారాలను ప్రజలు భరించాల్సిన అవసరం లేదన్నారు. సిఐటియు నాయకులు బాబావలి మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు కాక, పని ఒత్తిడి ఎక్కువై సతమవుతున్న కార్మికులపై ట్రూ అప్ ఛార్జీల భారం మోపడం శోచనీయమన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన 6 నెలల్లోనే నిత్యావసర ధరలు పెరిగాయన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయకపోగా ట్రూ అప్ ఛార్జీల పేరిట ప్రజలపై విద్యుత్ భారాలు వేయడం దారుణమన్నారు. సమావేశంలో సివిల్ సప్లైస్ హమాలీ సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు తిప్పన్న, ఉత్తప్ప, అల్‌కౌసర్ ట్రస్ట్ నాయకుడు అహమ్మద్, ఇలియాజ్, అంగనవాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు బావమ్మ, వెంకటేశులు, కార్పెంటర్ నరసింహ, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, కార్యవర్గ సభ్యులు ఈఎస్.వెంకటేష్

ప్రజాశక్తి-కొత్తచెరువు

సిపిఎం జెండాను ఆవిష్కరించిన సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, కార్యవర్గసభ్యులు ఈఎస్. వెంకటేష్

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీ లను తక్షణమే అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, కార్యవర్గ సభ్యులు ఈఎస్. వెంకటేష్ డిమాండ్ చేశారు. స్థానిక ధర్మవరం రహదారిలో ఆదివారం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పవన్‌కుమార్ అధ్యక్షతన మండల శాఖ మహాసభ నిర్వహించారు. ముందుగా స్థూపం వద్ద జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ జనవరి 1, 2 తేదీల్లో సిపిఎం జిల్లా మహాసభలు నిర్వహిస్తామ న్నారు. వాటికంటే ముందు జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల మహాసభలు నిర్వహించి ప్రతినిధులను ఎన్నుకుంటామన్నారు. గత పోరాటాలపై సమీక్షించుకొని రానున్న మూడేళ్లలో ప్రజా సమస్యల పరిష్కా రం కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటామన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేసేలా పెద్దఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుమల ఆలయ విషయంలో రాజకీయ చేయడం బాధాకరం అన్నారు. లడ్డూ తయారీలో కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. దేశంలో పదేళ్లుగా పాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వం మతతత్వంతో ప్రజలను రెచ్చగొడుతుందన్నారు. ప్రధానమంత్రి ఎన్నికల సమయంలో మత విద్వేష ప్రసంగాలు చేయడం బాధాకరమన్నారు. భారతదేశం లౌకిక దేశమని, అన్ని కులాలు సమానం అన్నారు. ప్రభుత్వం నూతన మద్యం పాలసీని ప్రవేశపెట్టి నాయకుల ఆదాయం కోసం పాకులాడుతుందన్నారు. ఎక్కడపడితే అక్కడ మద్యం షాపులు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. కృష్ణా జిల్లాలో వరదలతో నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శిగా ముత్యాలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు లక్ష్మీనారాయణ, బ్యాళ్ల అంజి, శ్రావణి, నాగమణి, లక్ష్మన్న, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబాన్ని ఆదుకోవాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

రాయచోటి పట్టణంలో మృతి చెందిన ఉపాధ్యాయుని కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఉపాధ్యాయుడి మృతికి శ్రద్ధాంజలి ఘటించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుని మృతి బాధాకరమ న్నారు. ఉపాధ్యాయుడి మృతిపై సమగ్ర విచారణ చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుం డా ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మవరం జోన్ యుటిఎఫ్ నాయకులు హనుమంతరావు, రామకృష్ణానాయక్, లక్ష్మయ్య, అమర్‌నారాయణరెడ్డి, సకల చంద్రశేఖర్, పెద్దకోట్ల సురేష్, సాయి గణేష్, హెచ్.రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఉచిత వైద్య శిబిరంలో చికిత్స చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

కందికుంట నారాయణమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని బాలికల పాఠ శాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముందుగా ముఖ్యఅతిథి టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పవన్ కుమార్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ నియోజకవర్గ పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించడం అభినందనీయమన్నారు. శిబిరంలో అనంతపురం నగరంలోని మార్క్ ఆసుపత్రి వైద్యులు షుగర్, బీపీ, కిడ్నీ, గుండె, తదితర జబ్బులకు వైద్య పరీక్షలు చేశారు. 189 మందికి వైద్య పరీక్షలు చేసి 28 మంది వ్యాధిగ్రస్తులను గుర్తించినట్లు డాక్టర్ నాగరాజు తెలిపారు. ట్రస్ట్ ఆర్గనైజర్ నాగేష్ మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి మండలంలో నెలలో రెండు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. శిబిరంలో కోడూరు శ్రీధర్, మార్క్ ఆసుపత్రి కోఆర్డినేటర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు బయల్దేరిన అయ్యప్ప మాలధారులు

ప్రజాశక్తి-అగళి

శబరిమలకు బయల్దేరిన అయ్యప్ప మాలధారులు

మండలంలోని దొక్కలపల్లి గ్రామంలో ఆదివారం గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధా రులు ఇరుముడి కట్టుకుని శబరిమల యాత్రకు బయల్దేరి వెళ్లారు. ముందుగా 13 మంది మాలధారులు గ్రామంలోని బసవన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి కట్టారు. అనంతరం ప్రత్యేక బస్సులో శబరిమలకు బయల్దేరి వెళ్లారు. స్థానిక నాయకుల ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పూజలో పాల్గొన్నారు. అయ్యప్ప మాలధారులకు పూలమాలలు వేసి యాత్రకు సాగనంపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కుమారస్వామి, జడ్పిటీసీ ఉమేష్, నాయకులు శివకుమార్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, చిదానంద, నందకుమార్, నరసింహప్ప, రమేష్, బసవరాజు, రాజ్‌గోపాల్, శివలింగప్ప, జగదీష్, సన్నప్ప, చంద్రప్ప, తిప్పేస్వామి, క్రిష్ణప్ప పాల్గొన్నారు.

కొడికొండచెక్‌పోస్టు-శిర మార్గంలో తరచూ ప్రమాదాలు

ప్రజాశక్తి-మడకశిర రూరల్

కొడికొండ నుంచి శిర మార్గంలో ప్రమాదాలు జరిగే ప్రదేశాలు

కర్నాటకలోని బెంగళూరు-బళ్లారి జాతీయ రహదారిని, పూణే-చెన్నై జాతీయ రహదారిని అనుసంధానం చేయడం కోసం కొడికొండ చెక్ పోస్ట్ నుంచి శిర పట్టణం వరకూ నూతనంగా జాతీయ రహదారి వేశారు. ఈ రహదారి హిందూపురం, మడకశిర, రొళ్ల, అగళి మీదుగా శిర వరకూ ఏర్పాటు చేసి ఆ రెండు జాతీయ రహదారులను అనుసంధానం చేశారు. గతంలో బెంగళూరు, తుమకూరు మీదుగా శిర హిరియూర్ వెళ్లేవారు. కొడికొండ చెక్ పోస్ట్ నుంచి శిర వరకూ జాతీయ రహదారి వేయ డంతో దాదాపు వంద కిలోమీటర్ల దూరం తగ్గింది. మడకశిర మీదుగా నూతనంగా ఏర్పాటు చేసిన మార్గంలో భారీ వాహనాల రాకపోకలు పెరిగాయి. జాతీయ రహదారి కావడంతో వాహనాలు సైతం వేగంగా వెళ్తుంటాయి. ఈక్రమంలో ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్ప టికే పలువురు వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురై మృతిచెందడంతో పాటు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో కొడికొండ చెక్ పోస్ట్ నుంచి శిర వరకూ నిర్మాణమైన జాతీయ రహదారి ఇరువై పులా ఉన్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, వాహనదారులు, పాదచారులు ఈ మార్గంలో రావాలంటే భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మడకశిర మండలంలోని తడకలపల్లి, బుల్లసముద్రం, అచ్యుతాపురం, చీపులేటి ప్రాంత ప్రజలు ఈ జాతీయ రహదారిపైకి రావాలంటే ఆలోచించే పరిస్థితి ఏర్పడింది. కావున జాతీయ రహదారి అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు ఏర్పాటు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సిఐ, ఎస్ఐలకు సన్మానం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

సిఐ శివరాముడును సన్మానిస్తున్న ముస్లిం సంఘం నాయకులు

ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ముదిగుబ్బ యుపిఎస్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సిఐ శివ రాముడు, ఎస్ఐ ఇసాక్‌బాషాలను ఆదివారం ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు, మత పెద్దలు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఖలందర్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులకు శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చింతపండు హైదర్‌వలి, జామియా మసీదు ముతవల్లి వలీసాబ్, సరితాల షబ్బీర్, రాళ్లపల్లి బాబు సాహెబ్, బేకరీ చాంద్‌బాషా, ఏనుగుల అల్లాబకాష్, కుతుబుద్దీన్, షబ్బీర్, ముస్తాక్, ఇర్ఫాన్, యాసిన్, మైను, ముబారక్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వైసిపి నాయకులు అరెస్టు

ప్రజాశక్తి-కదిరి టౌన్

మోసపూరిత కేసులో ఆదివారం పోలీసులు వైసిపి నాయకులను అరెస్టు చేశారు. రూరల్ సిఐ నాగేంద్ర తెలిపిన వివరాలు.. తనకల్లు మండలానికి చెందిన వైసిపి నాయకులు కొక్కంటి శ్రీనివాసులునాయుడు, నీలకంఠారెడ్డి, నాగమల్లారెడ్డి చండీఘర్‌కు చెందిన పునీత్‌నంద కలిసి కదిరి పరిసర ప్రాంతాల్లో రైతుల నుంచి తక్కువ ధరకు భూమిని కొనుగోలు చేశారు. బెంగళూరు, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో ఉన్న వారిని మభ్యపెట్టి ఆ భూముల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టి నెలకు రూ. 10వేల నుంచి రూ. 15వేల ఆదాయం ఇస్తామని నమ్మబలికి భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆ తర్వాత పండ్ల తోటలు పెట్టకుండా వారి నుంచి కోట్ల రూపాయలు తీసుకుని మోసం చేవారు. కొక్కంటి రెవెన్యూ గ్రామంలోని కొండవెనుకపల్లి సమీపంలోని పొలాలను కొక్కంటి శ్రీనివాసులునాయుడు, నీలకంఠారెడ్డి, నాగమల్లారెడ్డి కలిసి మధ్యవర్తుల ద్వారా పునీత్‌నందకు చూపించి రెవెన్యూ అధికారుల సాయంతో మొత్తం 5.98 ఎకరాల భూమిని నాగమల్లారెడ్డి పేరుపై అక్రమంగా రికార్డుల్లోకి ఎక్కించారు. ఆ భూమిని పునీత్‌నంద ద్వారా బెంగళూరుకి చెందిన ఓ వ్యక్తికి విక్రయించి రూ. 12 లక్షలు లబ్ధి పొందారు. అయితే వీరి నుంచి భూమి కొనుగోలు చేసిన వ్యక్తి మోసం చేశారని గ్రహించి తనకల్లు పోలీస్ స్టేషన్‌లో పునీత్‌నంద, నాగమల్లారెడ్డిపై ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్ఐ గోపి సిబ్బందితో కలిసి నిందితులు కొక్కంటి శ్రీనివాసులునాయుడు, నీలకంఠారెడ్డి, నాగమల్లారెడ్డిని ఆదివారం తనకల్లు మండలంలోని మండ్లిపల్లిమిట్ట వద్ద ఉన్న విఆర్ ఫ్యామిలీ రెస్టారెంట్ వద్ద అరెస్టు చేసి 14 రోజుల రిమాండ్‌కు పంపారు.

పొలంలో ట్రాక్టర్ బోల్తా.. రైతుకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-సోమందేపల్లి

పొలంలో బోల్తా పడిన ట్రాక్టర్

మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామంలో రైతు ముత్యాలప్ప తన పొలంలో ఆదివారం ట్రాక్టర్‌తో పొలం దుక్కి పనులు చేస్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. సమీపంలోని రైతులు గమనించి హుటాహుటిన అక్కడికి చేరుకుని ట్రాక్టర్ కింద ఉన్న ముత్యాలప్పను కాపాడారు. రైతుకు తృటిలో పెద్ద ప్రమాదం తప్పిందని సర్పంచి పరంధామ తెలిపారు.

కోడిపందెం జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని టిఎన్.పాళ్యం గ్రామ సమీపంలో కోడిపందెం ఆడుతుండగా ఐదుగురిని అరెస్టు చేసినట్లు పట్నం ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. కొడిపందెం జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రెండు కోళ్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు, రూ. 3,060 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది సరితాల బాషా, రహీం, రమణ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ట్రాక్టర్లను సీజ్ చేసిన సిఐ శివరాముడు

మండలంలోని ఉప్పలపాడు ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 3 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహశీల్దార్ నారాయణ స్వామి, యుపి ఎస్ సిఐ శివరాముడు తెలిపారు. మండలంలో ఎవరైనా ఎంతటి వారైనా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే పిఎ సురేంద్ర

ఆలయ అభివృద్ధికి రూ. 2 లక్షల విరాళం

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని మొరంపల్లిలో వెలిసిన శివాలయం అభివృద్ధికి ఆదివారం ఎమ్మెల్యే బాలక్రిష్ణ పిఎ సురేంద్ర, టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి రూ. 2 లక్షల విరాళం అందజేశారు. ముందుగా వారు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నారాయణస్వామి, రవికుమార్, టిడిపి, జనసేనపార్టీల నాయకులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయకపోతే ఆందోళన ఉధృతం

ప్రజాశక్తి-గాండ్లపెంట

దళిత రైతులకు న్యాయం చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, పారిశుధ్య కార్మికులు మండల కన్వీనర్ అక్కులప్ప, నరసింహులు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ రెండు రోజుల నుంచి కటారుపల్లికి చెందిన దళిత రైతులు ఓబులేసు, వెంకట రమణ, గంగాద్రిలకు కదిరి ఆర్డీవో విఎస్ శర్మ న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు దీక్షను తాత్కాలికంగా విరమించారు. ఆర్డీవో ఆదేశాల మేరకు తహశీల్దార్ వారి సమస్యను పరిష్కరించని పక్షం లో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత రైతుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా మా కక్షిదారు అయినటువంటి కె.రసూల్ S/o లేట్ ఖలీల్, ఆరె పేట, మడకశిర గ్రామము ఇంటి నెంబరు 7-95 అనువారు నా కక్షిదారుడు 31-01-2020వ తేదీన విక్రయ దస్తావేజు నెంబరు 212/2020 మేరకు శ్రీ సత్యసాయి జిల్లా, మడకశిర మండలం, మడకశిర గ్రామ పొలము నందు సర్వే నెంబరు 468-2 విస్తీర్ణము ఏ 15-10పైకి ఏ 6-52 సెంట్ల నందు 0-03 సెంట్లు విస్తీర్ణము గల ప్లాట్ నెంబరు 61ను ఎ.జుంజన్న S/o అశ్వర్థనారాయణ, జిల్లేడుకుంట గ్రామము, మడకశిర మండలం అనువారి నుండి కొనుగోలు చేసి, సర్వ సంపూర్ణ హక్కులతో అనుభవించారు. సదరు పై విక్రయ లింకు దస్తావేజు నెంబరు 2122/2015 నా కక్షిదారుడు హిందూపురంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో వెళుతుండగా పోగొట్టుకున్నాడు. సదరు దస్తావేజు పై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరములు, క్లైయిములు, సెక్యూరిటీలు, హక్కులు వగైరాలు ఉన్నచో, ఏడు రోజులలోపు వ్రాత పూర్వకముగా ఈ క్రింది కనబరచిన అడ్రసుకు తెలియజేయవలెనని, గడువులోపల ఎటువంటి క్లైయిములు తెలియజేయనిచో అప్పేచి ఆస్తిగా భావించవలసి ఉన్న గడువు అనంతరం వచ్చు ఆక్షేపణలు వగైరాలు నా క్లయింటు హక్కులకు సంబంధించి ఎలాంటి బైండు చేయ జాలవు.

షెడ్యూలు

అనంతపురం జిల్లా, హిందూపురం రి.డి., మడకశిర సబ్.రి.డి., మడకశిర నగర పంచాయతీ ఏరియా మడకశిర గ్రామ పొలములో నా పట్టా డాక్యుమెంట్ నెంబరు 122/2010 మేరకు సవరణ దస్తావేజు రిజిస్టరు కాబడి నా స్వయార్జితపు నా హక్కు అనుభవంలో ఉండు ఆస్తి వివరం 5వ వార్డుకు చేరినది. రెసిడెన్షియల్ ఏరియా, లింకు డాక్యుమెంట్ నెంబర్లు 2122/2015.

బాబు	సర్వే నెం.లె	విస్తీర్ణం
సర్కారు కుష్కి	468-2	15-10 సెంట్ల పైకి 6-52 సెంట్లు నందు 0-03 సెంట్లు ప్లాట్ నెంబరు 61

కొలతలు:- **తూర్పు-పడమర:** 75 లింకులు (49.5 అడుగులు), ఉత్తర-దక్షిణం: 40 లింకులు (26.4 అడుగులు) అనగా 145.2 చ గజాలు, **చెక్కుబంది:** **తూ:** ప్లాట్ నెం.62 ఆర్. నాగరాజప్ప బయలు **ప:** ప్లాట్ నెం.60 కమలమ్మ బయలు **ఉ:** కాలనీ రోడ్డు ద: ప్లాట్ నెంబర్ 65 మంజమ్మ బయలు ఈ మధ్యల బయలు.

H.K.Venkateswara Rao, B.Com., B.L.,
Advocate, Hindupur. Sri Sathya Sai District,
Mobile No: 9440936410.